# కారణం

రామకృష్ణయ్య కొండంత ఆశతో రైలుదిగాడు. ఆ ఆశ వట్టి అడియాస అవుతుందని లోలోపల పుట్టెడు భయమూ లేకపోలేదు. రైలుదిగగానే ఆ భయం మరింత ఎక్కువైంది.

ఆకాశానికి నిచ్చెనలు వేసి తను పరిహాసాస్పదుడౌతాడేమోననే శంకకూడా కలిగింది. అయినా ధైర్యంచేసి వుత్సాహాన్ని కూడదీసుకుని ప్లాట్‌ఫారం దాటి స్టేషన్ బయటికి వచ్చాడు రామకృష్ణయ్య. రిక్షా వాళ్లు, జట్కా బళ్ళ వాళ్లు ఎగబడ్డారు.

"రిటైర్డ్ డిప్యూటీ కలెక్టరు జనార్దనం గారింటికి వెళ్ళాలి."

అంతకి ముందెప్పుడూ తన అనుభవంలోకి రాని గర్వచ్ఛాయ మనసులో మెదిలి మాటల్లో తొణికినట్టు ఆయన పసిగట్టాడు. ఆ వెంటనే ఏదో నిరుత్సాహం ఆవరించింది. జనార్ద

నం అంతస్తెక్కడ. తన అంతస్తెక్కడ! తనొక మామూలు గుమాస్తా. అకౌంట్స్ టెస్ట్ ప్యాస్ కాకుండా నిర్లక్ష్యం చేసినందుకు ఆయన మొదటిసారిగా చింతాక్రాంతుడయ్యాడు. ఆ టెస్టు ప్యాసైతే ఎప్పటికో కనీసం డిప్యూటీ తాసిల్దారన్నా అయేవాడు. ఇప్పుడు ఏజ్ బార్! ప్చ్... లాభంలేదు ఇంకో పదేళ్ళకి రిటైరై పోతాడు.

"చిత్తం, రండి బాబు, ఆరణాలు."

రిక్షావాడు రామకృష్ణయ్య ఆలోచనలకి అంతరాయం కలిగించి బాడుగ రిజర్వ్ చేసుకోటానికి ఆయన దగ్గిర మరే వస్తువూ లేకపోవటంవల్ల ఆయన చేతి కర్రనే లాక్కుని రిక్షాలో పెట్టాడు. రామకృష్ణయ్య బేరానికి అలవాటు పడ్డవాడే అయినా, ఆ క్షణాన గీచి గీచి బేరంచేసి రిక్షావాడి ముఖంలో అసంతృప్తిని చూడదలుచుకోక వెంటనే రిక్షా ఎక్కి కూచున్నాడు.

చేరవలసిన స్థలం చేరువౌతున్న కొద్దీ ఈ ప్రయాణం ఆయనకి అర్థరహితంగా కనిపించసాగింది. అనవసరంగా ఖర్చులుపెట్టుకుని వస్తున్నాడు. కార్డుముక్క వ్రాయమంటే సరిపోయేది. ఆమాటకొస్తే వాళ్ళు వ్రాస్తామనే అన్నారు. తనే మర్యాదకోసం ఆరోజు స్వయంగా వస్తానని చెప్పాడు. అయినా వ్రాస్తామంటే మాత్రం వాళ్ళు నిజంగా వ్రాయబోతారా! ఆ మాత్రం బెట్టు మగపెళ్ళివాళ్ళకుండదూ! నీరజకి వచ్చినట్లు చెప్పందే ఆ కుర్రవాడు ముందు తన అభిప్రాయం బయటపెడతాడా! నీరజ అదృష్టం బావుండి ఈ సం

బంధం కుదిర్తే! ఎంతఅదృష్టం! ఏమిటో. అందని వాటికోసం తను పాకులాడ్తున్నాడు! అతను క్లాస్‌వన్ ఆఫీసర్. ఐ. ఎ. ఎస్. లో సెలక్టయికూడా దురదృష్టంవల్ల రాంకు రాక రిక్రూట్ కాలేదుగాని, కలెక్టరు కావలసినవాడు. ఇప్పుడైనా ఏంతక్కువ! ఇన్‌కంటాక్సు ఆఫీసర్! అంతహోదాగలవాడు నీరజని నిజానికి ఏంచూసి చేసుకుంటాడు? పెద్దచదువూ చెప్పించలేదు తను. సంసారపక్షమేగాని, అంతపెద్ద అందగత్తె కూడా కాదు. తను ఏ ఆధారంతో ఆశపెట్టుకుని వస్తున్నాడు!

రిక్షాఆగింది. కోటు, కండువా, కళ్ళజోడు సరిచేసుకుని రిక్షాదిగి కర్ర చేత్తోపట్టుకుని రిక్షావాడికి డబ్బిచ్చి గేటు సమీపించాడు రామకృష్ణయ్య. ఓరగా గేటు తలుపులు వేసి వున్నాయి. 'శుభం' అనుకున్నాడు. తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళాడు.

వరండాలోకూర్చుని పేపరు చదువుకుంటున్న జనార్దనం తలుపుచప్పుడువిని తలెత్తిచూసి "రండి, రండి రామకృష్ణయ్యగారూ!" అన్నాడు.

రామకృష్ణయ్య నమస్కారంచేసి చెప్పులు బయటనే విడిచి వరండా సమీపించాడు.

"కూర్చోండి, ఒరే వెంకాయ్! నీళ్లు తీసుకురా" జనార్దనం పురమాయించాడు.

జవాను వెంకాయ్ నీళ్ళచెంబు అందివ్వగా, కొద్దిగా వణికేచేత్తో పుచ్చుకుని కాళ్లుకడుక్కుని కుర్చీలోకూలబడ్డాడు రామకృష్ణయ్య.

"ఏమిటి విశేషాలు? పొద్దున బండికే వచ్చేసారా?"

"మరేనండి. నెత్తిమీద జరువంటూ వున్నాక. త్వరగా దింపుకోవద్దండీ!"

జనార్దనం నవ్వి "ఒరే గోపాల్!" అని కేకేశాడు. ఆ కేకతో రామకృష్ణయ్య ఆశ సగం హరించింది. ఆ బంగార మంత మాటా యిప్పుడే అనేస్తాడేమోనని భయపడ్డాడు. తను నిరొత్సాహమూలంగా చెప్పలేక యేదో పిల్లవాడినోటిమీది నుంచే 'ఇప్పుడప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదండీ!' అనిమర్యా దగా అనిపించేట్టున్నాడని రామకృష్ణయ్య వుస్సురన్నాడు.

రాజగోపాలరావు, తండ్రికేకకి వెంటనే పలికి, చదువు తున్న పుస్తకం చేత్తోపట్టుకునే వరండాలోకి ప్రవేశిం చాడు.

"రామకృష్ణయ్యగారు వచ్చారు." అన్నాడు జనార్ద నం.

"నమస్కారమండీ!" అన్నాడు రాజగోపాల్ చిరు నవ్వుతో.

"కూర్చో బాబూ!" అన్నాడు రామకృష్ణయ్య, ఎటు వంటిమాట వినడానికైనా సిద్ధపడి.

"మావాడికి యు. పి. లో ఇండిపెండెంటు ఛార్జి యిచ్చారండీ! వెళ్ళాలట. సెలవులేదు."

"అయ్యా" అన్నాడు రామకృష్ణయ్య, మున్నాతిక ఆశ హరించగా,

"ఓ పదిహేనురోజుల్లో వెడతాడు. పెళ్ళిచేసుకుని వెళ్ళమని మేం కోరుతున్నాం. దగ్గిరా, దాపా? మళ్ళీ యిప్పట్లో రాడాయె!"

"చిత్రం!" అన్నాడు రామకృష్ణయ్య, ఆశ కొంచెం చిగురించగా.

"మరి పదిహేనురోజుల్లో ముహూర్తాలున్నాయా? వుంటేమాత్రం మీకు వీలు కావొద్దూ?"

తలకిందు లయ్యాడు రామకృష్ణయ్య: ఏమిటి తనువింటున్నది? నిజమా, కలా? ఆనందపారవశ్యంలో నోటివెంటమాట రాలేదు.

"బహుశా, మీకు సాధ్యం కాదేమో." అన్నాడు జనార్దనం.

"ఎంతమాట! ఎందుక్కాదండీ. మీరు ఔననాలేగాని, నిమిషాలమీద పన్లు చేయించనూ; ఇంతకూ అమ్మాయి అదృష్టం బావుంది" తనేం మాట్లాడుతున్నాడో కూడా తెలియకుండా అనేశాడు రామకృష్ణయ్య.

"అబ్బాయిదే అదృష్టం అనుకున్నాం మేము."

గోపాల్ చిరునవ్వు నవ్వాడు.

మనసు మంచో, మర్యాద తీరో. ఏదయితే యేం, అంతమాట ఆయన అన్నాక! వుప్పొంగిపోయాడు నీరజ తండ్రి.

"ఎంతమాట? మరి ...... కట్నం కానుకల విష యం..."

నాన్నాడు రామకృష్ణయ్య. పిల్ల నచ్చిందన్న సంబర మేకాని, కట్నంకానుకలు జ్ఞప్తికి వచ్చేసరికి, ఇంకా వ్యవహా రం మొదట్లోనే ఉన్నదని స్ఫురించి మళ్ళీ దిగజారిపోయాడు. పిల్లకి కొందరు నచ్చకా, కొందరికి పిల్ల నచ్చకా, కుదరనిసం బంధాల విషయం అలా వుంచి, పరవాలేదనుకున్నవి కట్నాల దగ్గిరే తుస్సుమన్నాయి. ఈ ఆఫీసరుగారెంతలో వున్నారో! అక్కడికీ తాహతుకి మించి ఖర్చుపెడదామనే అనుకుంటు న్నాడు. పెద్దపిల్ల కదా! కాని ఎంతైనా, వాళ్ళు వేలమీద వుంటే తనెక్కడినించి తేగలడు? ఈ సంబంధం ఆలోచించి నప్పుడే కట్నం విషయంలో తూగలేమని తను అన్నప్పుడు మధ్యవర్తి జనార్దనం వాళ్ళు పేచీకోరులు కాదంటేనే ముం దుకి జరిగాడు.

ఇప్పుడే మంటారో!

"వాటిదేముంది లెండి!" అన్నాడు జనార్దనం.

"మీారేదోమాట అంటే..."

"లాంఛనాల విషయమూ, మీా యిష్టం. మా వాడికి ఈ ఆడంబరాలు యిష్టంలేదు. మేమూ కాలంతో పోయే వాళ్ళమే."

"కట్నం..." నసిగాడు.

"లా ఒప్పుకోదు కదండీ." అన్నాడు రాజగోపాల్.

"అవుననుకోండి. అయినా..."

"ఇంక ఆ ప్రసక్తిలేదు. నేను ప్రభుత్వోద్యోగిని. శాసనాల్ని తు. చ. తప్పకుండా పాటించడం నా విధి."

రాజగోపాల్ గంభీర వదనంవైపు నోరు తెరిచి అలాగే చూస్తూ వుండిపోయాడు రామకృష్ణయ్య.

"ఇదేదో పూర్వజన్మ సుకృతం." ఆమాట అనకుండా వుండలేక పోయాడు.

"మా నిరూ పూర్వజన్మలో గట్టినోము లే నోచిందండీ బావగారూ!"

రామకృష్ణయ్య కంఠం గాద్గదికమైంది. కృతజ్ఞతా భావంతో ఆయన జనార్దనానికి వెయ్యి నమస్కారాలూ, రాజగోపాల్‌కి పదివేల ఆశీస్సులూ సమర్పించాడు. వివాహానికి సంబంధించిన మిగతా విషయాలన్నీ మాట్లాడి, మర్నాడు తాంబూలాలు పుచ్చుకోటానికి ఏర్పాటుచేసుకొని రామకృష్ణయ్య మహానందంతో సెలవు పుచ్చుకుని స్టేషను వైపు నడిచాడు.

ఆశ అనేది పీడుస్తూంది కనుక తను ఈ సంబంధం కోసం ప్రయత్నించాడేకాని, ఇది కుదురుతుందని తనెప్పుడూ అనుకోలేదు. ఇంతమంచి సంబంధం ఖర్చులేకుండా దొరుకుతుందని ఆశించటానికికూడా అవకాశంలేదు. వాస్తవం కల్పనకంటె ఆశ్చర్యకరమైనది అంటారు. అది తనపట్ల అక్షరాలా నిజమైంది. వాళ్ళవైపునించి ఆలోచించిచూస్తే, ఇంత సుల

భంగా పెళ్ళి చేసుకోటానికి వాళ్ళెందుకు సిద్ధపడ్డారో ఆశ్చర్యంగా నేవుంది. మూడేళ్ళకిందట నీరజ ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసైంది. అప్పటినుంచీ చదువులేదు. ఊరికే వుండటం దేనికని నాలుగు హిందీ ముక్కలు నేర్చుకుంటున్నా అది వేరే విషయం. సంగీతమూ రాదు. నీరజమీది అభిమానంకొద్దీ అది బాగానే వుంటుందని తనుఅనుకున్నా, నిజం వొప్పుకోవాలంటే అంతకంటే యెంతో అందమైన పిల్లలు యెంతమంది లేరు! ఏ మాత్రం ప్రయత్నించినా అతనికి ఇంతకంటే మంచి సంబంధం అతితేలిగ్గా వస్తుంది. మరి వాళ్లు యెందుకు తమ సంబంధం ఖాయం చేసుకున్నట్టు? అందులో అతి త్వరగా కూడా కావాలంటున్నారు. ఇందులో కొంపదీసి ఏ లోపమో లేదుగదా! ఛీ... అదృష్టం కలిసొస్తుంటే తనేవో పిచ్చి ఊహలతో మనసు పాడుచేసుకుంటున్నాడు. నిక్షేపంలాంటి కుర్రాడు, అతనికేం!

ఆలోచించడం మానేసి హోటల్లోకి వెళ్ళి కాఫీ తాగాడు రామకృష్ణయ్య. ఇంకా రెండు గంటలకిగాని, తనకు తిరిగి వెళ్ళటానికి బండిలేదు. చప్పున అతనికో ఆలోచన తట్టింది. ఈ వూళ్ళో అడ్వకేటు నరసింహం తన క్లాస్ మేటు. ఒకసారి అతన్ని కలిస్తే?... ఈ సంబంధం అతని చెవినికూడా వేస్తే మంచిది. ఆడపిల్లనిచ్చేటప్పుడు వివరాలన్నీ విచారించాలి. తన బాధ్యత విస్మరించకూడదు.

రామకృష్ణయ్యని చాలాకాలం తర్వాతచూసి నరసింహం ఆప్యాయంగా పలకరించాడు. కాసేపు పిచ్చాపాటీ తర్వాత రామకృష్ణయ్య అసలు విషయం ఎత్తాడు.

"ఎవరు... జనార్దనంగారా!" అన్నాడాయన.

"అవును. మంచిసంబంధ మంటావా."

"కాకేం!"

రామకృష్ణయ్య తృప్తిపడ్డాడు.

"కట్నం ఎంతేమిటి."

"ఏంలేదు, ఏవో లాంఛనాలు మాత్రం యిస్తాం."

నరసింహం ఆశ్చర్యపడ్డాడు.

"వాళ్ళబ్బాయి ఏం చేస్తున్నాడన్నావు."

"ఇన్‌కంటాక్సు ఆఫీసర్."

"ఎవరు... ఆ యు. పి. లో ఉండే అబ్బాయా."

"ఊఁ"

"అన్నట్టు — ఆ మధ్య ఎవరో అనుకున్నారోయ్! అతను సంబంధాలన్నీ తిరగ్గొడుతున్నాడనీ, ఏదో తండ్రి పేచీ పడలేక వూరికే చూస్తున్నాడనీ అన్నారు మరి. అసలు యు. పి. లోనే ఎవరినో చేసుకున్నాడనో, చేసుకొంటాడనో కూడా అన్నారు. నాకు కచ్చితంగా తెలియదు సుమా! ఎందుకైనా మంచిది. బాగా విచారించు"

పిడుగుపడ్డది; ఇదా సంగతి? ఇది నిజమా! అందుకేనా యిలా త్వరగా మూడుముళ్ళూ వేయించి అతన్నో యింటి వాడిని చేయటం! లేకపోతే వాళ్ళిలా త్వరపడటం ఎందుకు. కట్నాలమీద ఆశలేనట్టుగా మాట్లాడారు! ఇదెంతవరకు అదర్శం! ఆ అబ్బాయి మనసు ఒకరిమీదుంటే, పెళ్ళి చేసుకున్న పిల్లని యేం సుఖపెడతాడు. చూస్తూ చూస్తూ నీరజని గోతు

లోకి తోయటంకాదూ! తను అనుమానిస్తూనే వున్నాడు. లేకపోతే అంత ఆస్తిపరులూ, ఉద్యోగస్థులూ తమలాంటి వారితో సంబంధం కలుపుకోచూస్తారా! నరసింహాన్ని కలుసుకోటం మంచిదేఅయింది. ఇంకెవరినైనా కూడా కనుక్కుంటే శ్రేయస్కరం.

మంచి సంబంధం కుదిరిందన్న ఆశ ఇలా ఆవిరైపోగా, వుస్సురంటూ రామకృష్ణయ్య రిక్షాఎక్కి స్టేషన్ చేరుకున్నాడు. వెయిటింగు రూంలో కూచుని ముందు కర్తవ్యాన్ని ఆలోచించసాగాడు.

వెయిటింగు రూమ్‌లో యిద్దరు యువకులు సిగరెట్లు తాగుతూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఒరే, గోపాల్‌ని చూశావూ. ఐతే మారిపోయాడురా!"

"ఔను, యు. పి. లో వుంటున్నాడుకదూ. ఆ వేషం ఆ ధోరణి."

"వేషం సరే, ఎప్పుడూ ఫారిన్ లిక్కర్స్. ఆఁ. మరేమిటనుకున్నా - హాట్రిడ్రింకర్."

రామకృష్ణయ్య ఆసక్తితో వినసాగాడు.

"ఆఫీసర్ గదుటోయ్"

"ఎవర్ని గురించండీ మీరు మాట్లాడేది?" రామకృష్ణయ్య ఆగలేక అడిగాడు.

వాళ్ళిద్దరూ ఈ అనవసరపు జోక్యానికి తెల్లబోయి, మర్యాదకి "మా ఫ్రెండండీ." అని మాత్రం అన్నారు.

"వారి పేరు."

"గోపాల్."

"పూర్తిపేరు? ఇక్కడ రిటైర్డ్ డిప్యూటీ కలెక్టరు జనార్దనరావుగారి అబ్బాయి రాజగోపాల్ అని వున్నాడు. ఒక వేళ అతనేమోనని - అడుగుతున్నాను."

వాళ్ళిద్దరూ రామకృష్ణయ్యవైపు సాలోచనగా చూశారు. అదేదో సంబంధం బాపతని పసికట్టి ఉండాలి.

"మీరు..."

"నాపేరు రామకృష్ణయ్యండీ: సంబంధం విచారించాలని యిక్కడ జనార్దనం గారింటికివచ్చి వెడుతున్నాను. మీరు మాట్లాడేది వారబ్బాయిని గురించేనా? అతను యు. పి. లో ఇన్‌కంటాక్సు ఆఫీసరు చేస్తున్నాడు."

ఒక యువకుడు చిరునవ్వు నవ్వాడు.

"అబ్బే కాదండీ! ఇతనిపేరు వేణుగోపాల్. ఎక్సయిజు డిపార్టుమెంటులో సూపరింటెండెంట్. మా క్లాస్‌మేటేలెండి. అదేనోయ్. ఎక్సయిజు డిపార్ట్‌మెంటుకదూ_మరి సప్లయికేం కొదవ?"

రామకృష్ణయ్య నిట్టూర్చాడు. 'కొంతనయం! రాజ గోపాల్‌ని గురించే వాళ్లు మాట్లాడు తున్నా రనుకున్నాను! కాదన్నమాట! అకస్మాత్తుగా అతని కో ఆలోచన వచ్చింది.'

ఆ యువకులు నవ్వుతున్నారు ఎందుకో! ఒకవేళ సంబంధం చెడగొట్టటం యెందుకని వాళ్ళు నిజం దాస్తున్నారా? తను ఒట్టి బుద్ధిలెక్కువవాడు. ముందే సంబంధం విషయం చెప్పాడు. ఎంతపొరపాటు! వాళ్లు నూట్లాడేవ్యక్తి రాజగోపాలమేనేమో చప్పున పేరు మార్చేశారు. అబ్బో, గడుగ్గాయిలు! కాని... కాని ... రూఢిగా ఎలా చెప్పగలడు.

రెండో యువకుడు అన్నాడు.

"మీరు చెప్పే గోపాలరావు నాకు తెలుసండీ! చాలా మంచివాడు. నాకు పరిచయముండేది. చాలా ఆదర్శవంతుడు. ప్రభుత్వంలో అలాంటి ఆఫీసర్లు వుంటే దేశం సుభిక్షం కాదుటండీ!"

క్షణం రామకృష్ణయ్య ముఖం వికసించింది. కాని ఆ యువకుడు తనని పరిహాసం చేస్తున్నాడో. నిజం చెబుతున్నాడో! అతను ఒకవేళ నిజమే చెబుతున్నా డనుకున్నా. అతనికి తెలిసినదెంతవరకో!

"అలాగా!" అన్నాడు రామకృష్ణయ్య మర్యాదకి.

తన కర్తవ్యమేమిటో ఆయనకి బోధపడలేదు. పుకార్లని నమ్మి సంబంధం వొదులుకోటమా? ఏమైతే అవుతుందని ఖాయంచేసుకోటమా? ఒప్పుకుంటే చేతులు కాలాక ఆకులు పట్టుకోట మవుతుందేమో! ఒప్పుకోకపోతే తన తెలివితక్కువ వల్ల నీరజ భవిష్యత్తుని పాడుచేసిన వాడవుతాడేమో. తీవ్రంగా ఆలోచించి, నరసింహంద్వారా మరికొంతమంది

పెద్దమనుష్యుల్ని విచారించాలని తీర్మానించుకుని ప్రయాణం మానుకున్నాడు. ఆ రోజుల్లో ఎక్కేగడపా దిగే గడపా. కొందరు అటూ, కొందరు యిటూ చెప్పారు. ఇదమిద్ధంగా ఏదీ తేలలేదు. ఆకుటుంబం చాలామంచిదని కొందరంటే, కొందరు పెదవి విరిచారు ఆలోచించినకొద్దీ ఎన్నో లోపాలు కనిపించసాగాయి. కొందరు గట్టిగా భరోసా యిచ్చారు. కొందరు ఊబిలోకి దిగవద్దని సలహా యిచ్చారు. ఎటూ తేల్చుకోలేక పోయాడు. మధ్యవర్తుల్ని గట్టిగా కనుక్కోవాలనుకున్నాడు. కాని అదీ అంత ప్రయోజనకారిగా కనిపించలేదు. విసుగుపుట్టి సాయంకాలం బండికి స్వస్థలం చేరుకున్నాడు.

భార్య రమణమ్మ 'కాయా పండా?' అని అడిగింది.

"కాయా, పండూ" అన్నాడు. సంతోషమూ, నిరుత్సాహమూ ఆమె ముఖంలో తాండవించాయి. 'ఏదో కారణం లేకపోతే వాళ్ళు మన సంబంధం ఒప్పుకుంటారా?' అని ఆమె కూడా అనుమానించింది. సందిగ్ధం భరించలేక రాజగోపాలరావు దగ్గిరికి వెళ్ళి 'బాబూ! ఉన్న నిజం చెప్పు. మాపిల్ల గొంతు కొయ్యనని మాటఇయ్యి. ఇవి చేతులు కావు కాళ్లు' అందామని కూడా రామకృష్ణయ్య అనుకున్నాడు. కాని రమణమ్మ 'ఛీ, ఛీ! అదేంపని?' అంది.

అయితే యింత జటిల సమస్య నీరజ నిమిషంలో తేల్చేసింది. తల్లితో రహస్యంగా రాజగోపాలరావునే చేసుకుంటానని ఖచ్చితంగా చెప్పింది, అంతే, పరిష్కారం కుదిరింది. ఇంక

కథా నిలయం
858
శ్రీకాకుళం



ఎవరి అదృష్టం వారిదని నిశ్చయించుకొని రామకృష్ణయ్య తాంబూలాలు పుచ్చుకున్నాడు.

వివాహం సలక్షణంగా జరిగిపోయింది.

సెలవు లేదని వివాహమైన మూడో నాడే నీరజతో రాజగోపాలరావు ప్రయాణం కట్టాడు.

రిజర్వు చేసిన ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో చెరొక బెర్తుమీదా కూర్చొని కిటికీల్లోకి చూస్తున్నారు నీరజా, రాజగోపాలరావులూ.

నీరజ మనసులో ఏవో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. కిటికీలోంచి తలతీసి రాజగోపాలరావు వైపు తదేకంగా చూడసాగింది.

"ఏమిటండీ దీక్షగా చూస్తున్నారు."

"చీకటినీ." అతను తల తిప్పకుండానే జవాబిచ్చాడు

"చీకట్లో ఏం కనిపిస్తాయి?"

"కనిపించవా?"

"ఎలా కనిపిస్తాయండీ?"

"ఎందుకు కనిపించవు?"

"ఎందుకేమిటి? చీకటి కనుక."

రాజగోపాలరావు తల నీరజవైపు తిప్పాడు.

"చీకటికి కారణమేమిటో."

"తెలీనట్టు! సూర్యుడు భూగోళం రెండో వైపు ప్రకాశించటమే కదండీ కారణం."

"అలా ఎందుకు ప్రకాశిస్తాడు."

ఆమె అతని కళ్ళల్లోకి చురుగ్గా చూసింది.

"నాకు సోషల్లో మంచి మార్కులే వచ్చాయండీ! పరీక్షించక్కర్లేదు."

"కాదు నీరజా! చెప్పు."

"భూమి పరిభ్రమిస్తూంటుంది కనుక."

"ఎందుకు పరిభ్రమిస్తూంటుంది?"

"ఏదో గ్రావిటేషనల్ ఫోర్స్ కాబోలు."

"అందుకు కారణం?"

"బాగుంది. ఇలా కారణానికి కారణం వెతుక్కుంటూ పోతే ఎక్కడ తేలుతాం?"

"కారణం లేకుండా కార్యం జరగదు కాబోలు."

సంశయంతో ఆమె కళ్ళల్లోకి చూశాడు. ఆమె కిదేమీ అర్థం కాలేదు.

"ఏమో బాబూ! నాకీ తర్కవితర్కాలు రావు."

రాజగోపాల్ చిరునవ్వు నవ్వాడు. కొంచెం సేపు నిశ్శబ్దం ఆవరించింది.

"ఒక విషయం అడగమంటారా?" అంది నీరజ అతని కళ్ళల్లోకి చూస్తూ.

"అడుగు పర్మిషన్ దేనికి." అన్నాడతను నవ్వుతూ.

"నిజం చెప్పాలి."

"అబ్బో, పెద్ద ఫిలాసఫర్లే చెప్పలేరు. నేనేం చెప్పగలను."

నీరజ నవ్వింది.

"తప్పించుకుంటున్నారు. పోనీలే మీరు మనస్ఫూర్తిగా నిజం అనుకున్నది చెప్పండి!"

"అయితే సరే."

"నిజం చెప్పాలి. అది నాకు సరిపడకపోయినా బాధ పడను. చెప్తారుకదూ! మీరు నన్నెందుకు చేసుకున్నారు."

"బాగుంది. నువ్వూ, మీనాన్నా, ఇంకా మీవాళ్ళందరూ ఇష్టపడ్డారు గనక."

"మీ సంగతి. ఇంక డొంక తిరుగుడు లేకుండా చెప్పండి!"

"చెప్పానుగా, నేనిష్టపడ్డాను కనుక - అంతే!"

"ఎందుకిష్టపడ్డారు."

"అంతే!"

"కారణం."

"ఓహో! లక్ష కారణాలున్నాయి."

"చెబుదురూ!"

"నువ్వు బాగుంటావు కనుక. అంటే, నీ కనుముక్కు తీరు పొందికగా ఉంటుంది కనుక. మరీ ఎర్రగా, మరీ నల్లగా ఉండవు కనుక. అంత పొడుగ్గా, అంత పొట్టిగా ఉండవుకనుక, వాలుజడ ఎబ్బెట్టుగా ఉంగరాలు తిరగకుండా, మరీ నక్కతోకకు మల్లే కాకుండా ఉంటుంది కనుక. కంఠస్వరం చిలుక గొంతులాకాక - కోయిల కంఠంలాకాక... ఇంకా ... ..."

"హుష్! చెప్పనంటే సరిపోదూ."

"ఇవన్నీ కారణాలు కావంటావా! ఇంకా నయం! నేను చాలా లిస్టు తయారుచేసిపెట్టుకున్నా!"

"ఎందుకూ!"

"ఎందుకేమిటి. నువ్వీ ప్రశ్న అడుగుతావని నాకు తెలుసుకనుక."

"తెలుసా."

"ఆ. ఎందుకు తెలియదూ. మీనాన్న అడిగితే అప్పుడే చెప్పేవాడిని కాని ఆయన పజిల్ సాల్వ్ చేసినట్టు చేసి, తరవాత తీరిగ్గా వెరిఫై చేద్దామనుకున్నారుగదా."

నీరజ అప్రతిభురాలైంది.

"చాల్లెండి, ఇంకానయం!"

"అబద్ధమా! పాపం నన్ను గురించి ఆయన ఎంత శ్రద్ధగా ఎంతమందిని వాకబు చేశారో తెలుసా."

"ఇంతకీ నా ప్రశ్నకి జవాబు చెప్పరు గదూ."

"కట్న పిశాచానికి బలి కాబోయే ఒక అమ్మాయిని ఉద్ధరించుదామని."

నీరజ ముఖం వెలవెల బోయింది.

"నిజమా?" నీరసంగా అడిగిందామె.

"నిజమైతే 'నాకంటె గతిలేనివాళ్ళు వేలకి వేలుంటే నన్నే ఎందుకు ఏరుకోవాలి?' అని అడగవేం?"

నీరజ ముఖం వికసించింది.

"మీ ధోరణి ఏమిటో! పోన్లెండి చెప్పకపోతే మానె!"

"కారణం ఉంటేగా చెప్పడానికి."

"చెప్పొద్దన్నాగా."

"తరతమాలకి అంతెంటూ లేదుకదా నీరజా! వెతుక్కుంటూ ఎంత దూరమైనా పోవచ్చు. నీలో ఏలోపమూ నాకు కనిపించలేదు. ఒప్పుకున్నాను. అంతే."

"అంతేనా." అందామె.

ఆమె ముఖంలో కళ లేదు. ఆమె వదనంవైపు చూసి రాజగోపాలరావు నవ్వాడు.

"కాదు."

"ఇదెక్కడి మనిషిరా బాబూ!"

విసుక్కున్నా ఆమె ముఖంలో పోయిన కళ మళ్ళా వచ్చింది.

"అయితే ఏదో కారణం ప్రతిదానికీ ఉండి తీరాలంటావు."

"ఈ శాస్త్ర యుగంలోనే కారణం లేదంటే ఎవరొప్పుకుంటారండీ మరీ!"

"అయితే ఏదో ఉండాలన్నమాట."

రాజగోపాలరావు ఆలోచనగా ఆమెవైపు చూశాడు.

"నన్నేడిపించకండీ! మీకో నమస్కారం. బుద్ధి తక్కువయి అడిగాను."

బుంగమూతి పెట్టింది నీరజ. తల పక్కకి తిప్పుకుంది.

కళ్ళ చివరల్లోంచి చూపులు తూపులుం విసిరి, తల దురుసుగా ఎగరేసి, గడ్డ కింద చెయ్యి పెట్టుకుని కిటికీవైపు చూసింది.

రాజగోపాలరావుకి నవ్వు వచ్చింది. ఒక్క క్షణం బుర్ర గోక్కున్నాడు.

"ఓసి పిచ్చి పిల్లా! 'తొలి చూపులోనే ప్రేమించాను' అని వల్లె వేయటం చర్విత చర్వణం గదా! కొత్త మాట దొరుకుతుందేమోనని ఆలోచిస్తున్నాను."

"ప్లాండీ" అందామె పెదవులపై విసిరిన లేనవ్వు అందంగా నొక్కేస్తూ.

"మనిషిని మనిషి ఆకర్షించటం ఆర్టో, సైన్సో, ఈ రెండూకావో తెలియకుండా ఉంది. అసలు ఆకర్షణ లేనిది నిజమో, కల్పనో!"

అర్ధస్వగతంగా అన్నాడు రాజగోపాలరావు.

"మాటలకి 'టాక్సు' లేదు కాబోలు!" అంది నీరజ. రాజగోపాలరావు 'కారణం' తత్త్వాన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. నీరజమాత్రం తృప్తిగా కళ్ళుమూసుకుని బెర్తుమీద జేరగిల పడింది.